క్లుప్తంగా

ఘనంగా కార్పెంటర్స్ డే


కార్పెంటర్స్‌డేలో సంఘ సభ్యులు

సదుం: మండల కేంద్రంలో కార్పెంటర్స్‌డేని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మరమ్మతులకు గురైన బల్లలు, కిటికీలు, తలుపులను మరమ్మతు చేశారు. వారిని హెచ్ఎం ఫజురుల్లా అభినందించారు. అసోసియేషన్ కన్వీనర్ మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు అల్తాఫ్, హరి, అన్సర్ బాషా, జాబీర్, మురళీకృష్ణాచారి, బాలకృష్ణ, సుబ్రమణ్యం, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పులిచెర్ల(కల్లూరు): పౌష్టికాహారంతోనే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం పోషకాహార పక్వాడాలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఎంపీడీఓ సుగుణమ్మ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శిరీష, గోవిందరెడ్డి, రవీంద్రారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

31లోపు వడ్డీ లేకుండా పన్నులు చెల్లించండి

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్నులపై వడ్డీ లేకుండా చెల్లించే సౌకర్యం ప్రభుత్వం ఈనెల 31 వరకు పొడిగించినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆస్తులు కలిగిన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సత్వరమే వడ్డీ లేకుండా పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని 16 సచివాలయాల పరిధిలో సిబ్బంది ద్వారా బకాయి వసూళ్లు చేపట్టామన్నారు.

హుండీ ఆదాయం రూ. 82వేలు

పుంగనూరు: పట్టణంలోని బోగనంజుండేశ్వర స్వామి ఆలయ హుండీ ద్వారా రూ.82,549 వేలు ఆదాయం లభించినట్లు ఈఓ కమలాకర్ తెలిపారు. సోమవారం ఆలయంలో బహిరంగంగా హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించామన్నారు. హుండీ ఆదాయాన్ని స్వామివారి ఖాతాలో జమ చేశామని తెలిపారు.

పరీక్ష సామగ్రి వితరణ


పరీక్ష సామగ్రితో విద్యార్థులు

రొంపిచెర్ల: పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బండకిందపల్లె సర్పంచ్ అన్సర్‌బాషా పరీక్ష సామగ్రిని ఉచితంగా సోమవారం పంపిణీ చేశారు. రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నారు. వీరందరికి రూ.10 వేలు విలువ చేసే పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, రబ్బర్లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఎంఈఓ హసన్‌బాషా, హెచ్ఎం లక్ష్మీదేవి, సీఆర్పీ రాజేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఆదర్శ విద్యార్థుల ఎంపిక

గుడుపల్లె: నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌నకు గుడుపల్లె ఆదర్శ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ భువనేశ్వరి తెలిపారు. 8వ తరగతికి చెందిన గీతాంజలి, దక్షిత, విమల్‌రాజ్ ఎంపికయ్యారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

పొలంబడితో ఎన్నో లాభాలు


పొలంబడి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ

పలమనేరు: పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు ఎన్నో లాభాలుంటాయని పలమనేరు వ్యవసాయ అధికారిణి సంధ్య తెలిపారు. టి.వడ్డూరుకు చెందిన కంబిరెడ్డి పొలంలో సాగుతున్న పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు.

రియల్టర్‌పై ఫిర్యాదు

శాంతిపురం: పెద్దబొమ్మనపల్లి రెవెన్యూ పరిధిలో ఓ రియల్టర్ తమను మోసం చేశారని బాధితులు రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017లో 16 మంది ఇంటి స్థలాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నా ఇప్పటివరకూ స్థలాలను అప్పగించలేదని దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని సోమవారం ఏఎస్ఐ త్యాగరాజుకు ఫిర్యాదు చేశారు.

దారి సమస్యను పరిష్కరించండి

పలమనేరు: తమ ఇళ్లకు దారి లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకొని దారి సమస్యను పరిష్కరించాలని పట్టణ సమీపంలోని గంగవరం రెవెన్యూ గ్రామానికి చెందిన ఎద్దుల సంతవీధికి చెందిన లక్ష్మమ్మ, యశోద సోమవారం పలమనేరు ఆర్డీవో శివయ్యకు విన్నవించారు.

కాసుక్కూర్చున్నారు!

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద దళారుల బెడద
- పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ ఆఫీసుల వద్దే తిష్ట
- మాయమాటలు చెప్పి పైసా వసూళ్లు


పలమనేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జనం (ఫైల్)

పలమనేరు: పాలన పారదర్శకంగా ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం కోసం ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఇవి పనిచేస్తున్నాయి. పలమనేరులోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కొందరు దళారులు తిష్టవేసి సమస్యలతో వచ్చిన వారిని నమ్మిస్తూ ఏపనైనా మేం చేసిపెడతామంటూ అమాయకుల నుంచి డబ్బులు గుంజడమే వీరి వృత్తిగా పెట్టుకున్నారు. ముఖ్యంగా పట్టణంలోని పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయం పలు సచివాలయాలు, ట్రాన్స్‌కో కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిత్యం పదుల సంఖ్యలో దళారులు కాపుగాచి ఉంటారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఏపనైనా చేసిపెడతాం..

ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏపని కావాలన్నా తాము చేసి పెడతామంటూ వకాలత్ పుచ్చుకోవడం వీరి పని. తమకు అధికారులు తెలుసునని తామెళ్లి చెప్పామంటే పనులు జరుగుతాయంటూ నమ్మబలుకుతుంటారు. అసలు విషయం తెలియని అమాయకులు దళారుల మాటలను నమ్మి వారు అడిగినంత ఇచ్చినా పనులు కావు. తీరా తాము మోసపోయామని వాళ్లు తెలుసుకున్నా దళారులను ప్రశ్నించలేని పరిస్థితి. ఒకవేళ ఎవరైనా ప్రశ్నించినా తాము చెప్పడం వల్లే మీపని జరిగిందంటూ ఏమార్చుతుంటారు.

పంచాయతీలు, సెటిల్‌మెంట్లు సైతం..

పోలీస్‌స్టేషన్‌కు రాకముందే కాపుగాచే ఈ దళారులు ఇరువర్గాలతో కలిసి ప్రైవేటు పంచాయతీలు చేయడం కూడా ఇక్కడ రివాజుగా మారింది. ఈ విషయాలేవి పోలీసులకు తెలియకుండానే సాగడం గమనార్హం. ఇక భూములు, స్థలాలకు సంబంధించిన సెటిల్‌మెంట్లు చేసే బ్యాచ్‌లు కూడా ప్రత్యేకంగా ఉన్నాయి. అయితే జరుగుతున్న వ్యవహారాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయకపోవడంతో దళారుల హవా కొనసాగుతోంది. ఈ విషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా కార్యాలయం బయట జరిగే వ్యవహారాలను మేము ఏమీ చేయలేమన్నారు. ఎవరైనా దళారులు జోక్యం చేసుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఏ సమస్య ఉన్నా నేరుగా కలవండి..



పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులు నేరుగా స్టేషన్‌లోకి వచ్చి నన్ను కలవండి. లేదా ఎస్ఐలు, మా సిబ్బందికి సమస్యలు తెలపండి. అంతేగానీ బయట వ్యక్తుల మాటలు నమ్మకండి. వారు మాకు పోలీసులు తెలుసటే నమ్మొద్దు. ఎవరైనా మేము సెటిల్ చేస్తాం, పోలీసులకు సిఫార్సు చేస్తామంటే నేరుగా వచ్చి మాకు చెప్పండి.
–చంద్రశేఖర్, అర్బన్ సీఐ, పలమనేరు

నాడు - నేడు సకాలంలో పూర్తి


కడపనత్తం పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

బైరెడ్డిపల్లె: మండలంలో రెండవ దశ నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎస్ఎస్ఏ పీఓ వెంకరమణారెడ్డి ఆదేశించారు. కడపనత్తం, దేవదొడ్డి, బైరెడ్డిపల్లె, తీర్థం పాఠశాలలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సాయిలీల, హెచ్ఎంలు నందగోపాల్‌రెడ్డి, గౌరవ్ సుల్తాన్, విశ్వనాథయ్య, రత్నమ్మ, సుబ్రమణ్యం, సీఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


ప్యాడ్‌లు, పెన్నులు ఇస్తున్న చైర్మన్ సుధీర్

కుప్పంరూరల్: కష్టపడి కాదు ఇష్టపడి చదవాలని కుప్పం మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం కుప్పం పట్టణంలో బాలుర పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడితే జీవితంలో సుఖపడవచ్చని అన్నారు. తల్లిదండ్రులు ఆశయ సాధనకు పిల్లలు కృషిచేయాలన్నారు. చదువుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లిన తరువాత చదువుకున్న పాఠశాల, గ్రామానికి సేవ చేయాలన్నారు. పది పరీక్షల్లో మొదటి, రెండవ, మూడవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో కుమ్మరేష్, సర్దార్, ఇంతియాజ్, రాము, రాజా పాల్గొన్నారు.

ఆసరా వారోత్సవాలు విజయవంతం చేయాలి


స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు

పెద్దపంజాణి: ఈనెల 29వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ ఆధ్వర్యంలో జరగనున్న ఆసరా వారోత్సవాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యక్రమం నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సంపల్లి బాబు, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం


జంగాళ అగ్రహారంలో అవగాహన కల్పిస్తున్న ఫ్యామిలీ వైద్యాధికారి షాలిని

బైరెడ్డిపల్లె: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యమని ఫ్యామిలీ వైద్యాధికారి షాలిని పేర్కొన్నారు. జంగాళ అగ్రహారంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ తరచూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కోసం నిరసన

శాంతిపురం: అబకలదొడ్డి పంచాయతీలోని కోతిగుట్లపల్లి వద్ద శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ గ్రామ దళితులు సోమవారం జాతీయ రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. గ్రామ సమీపంలోని పశువుల మేత బీడు భూములు దురాక్రమణకు గురవుతున్నాయని, వాటిని సంరక్షించి శ్మశానం కోసం ఇవ్వాలని డిమాండు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్తులను రెవెన్యూ అధికారులతో మాట్లాడించడంతో నిరసన విరమించారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

పలమనేరు: పలమనేరు పురపాలకసంఘానికి సంబంధించి నేడు మున్సిపల్ కార్యాలయంలో జరిగే వైఎస్సార్ ఆసరా మూడో విడత సాయం పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరుకానున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, గ్రూపు మహిళలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న నేతలు, అధికారులు

గంగవరం: మండలంలోని పాత కీలపట్ల గ్రామంలో కొత్తగా నిర్మించే సీసీ రోడ్డుకు పంచాయతీ అధికారులు, నేతలు కలిసి సోమవారం భూమిపూజ చేశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ముందుగా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ గిరిరాజారెడ్డి, ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీఓ శివప్రసాద్, నేతలు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చిట్టి, విజయ్, శివన్న, కొండయ్య పాల్గొన్నారు.

నిర్దేశించిన ధరలకే మద్యం విక్రయించాలి


రొంపిచెర్లలో మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న దయాసాగర్

రొంపిచెర్ల: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది నిర్దేశించిన ధరలకే మద్యం విక్రయించాలని చిత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్ ఆదేశించారు. పీలేరు సర్కిల్ పరిధిలోని రొంపిచెర్ల మండలంలో మద్యం దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యం విక్రయించాలన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు మద్యం విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం ధరలను అయన ఇతరుల దగ్గర మద్యం కొనుగోలు చేయించి తెలుసుకున్నారు. అనంతరం మద్యం స్టాక్‌ను పరిశీలించారు. మద్యం అమ్మకాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తనిఖీల్లో సూపర్‌వైజర్లు సూరేషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న గంగాధరం

సోమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం తెలిపారు. సోమవారం అన్నెమ్మగారిపల్లె, పేటూరు, పెద్ద ఉప్పరపల్లె సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహసారథులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహసారథులు, వలంటీర్లను సమన్వయం చేసుకుని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాని సూచించారు. మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సర్వేశ్వరి, వైఎస్సార్‌సీపీ నేతలు రమణారెడ్డి, గణపతి, జిలాని పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను కాపాడండి

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపోను కాపాడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని స్థానిక పలమనేరు పరిరక్షణ సమితి కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. ఆమేరకు వారు జిల్లా ప్రజారవాణా అధికారిని సోమవారం కలసి ఓ వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ గతంలో డిపో నుంచి నడుపుతున్న వేలూరు, బెంగళూరు సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. సభ్యులు దవణముని, నారాయణ, రెడ్డెప్ప పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన


చిరుధాన్యాల గురించి వివరిస్తున్న సీడీపీఓ

రామకుప్పం: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలను తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చునని సీడీపీఓ అరుణశ్రీ తెలిపారు. విజలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీలకు సోమవారం చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అరుణశ్రీ మాట్లాడుతూ ప్రతిరోజూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వలన రక్తహీనత తగ్గుతుందన్నారు. కిషోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ జయంతి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంత వేలం రేపు

సోమల: మండలంలోని కందూరు సంత, ప్రైవేటు బస్టాండ్ నిర్వహణకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జైశంకర్, సర్పంచ్ మసూద్ సోమవారం తెలిపారు. సచివాలయంలో ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

పులిచెర్ల(కల్లూరు): మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పిల్లలకు పెట్టాలని ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు. పులిచెర్ల హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఏఎస్ఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 29 మంది గైర్హాజర్

పుంగనూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సోమవారం పట్టణంలో మూడు కేంద్రాల్లో పరీక్షలను పర్యవేక్షణాధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో మూడు కేంద్రాల్లో మొత్తం 821 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 29 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

శెట్టిపల్లి జెడ్పీ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శాంతిపురం: శెట్టిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పేద విద్యార్థి నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. అనికెర గ్రామానికి చెందిన వి.కిషోర్ తండ్రి బాల్యంలోనే చనిపోవడంతో తల్లి వేణమ్మ వ్యవసాయ కూలీగా పని చేస్తూ ఇద్దరు కుమారులను చదివిస్తోంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసిన కిషోర్ నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల వంతున స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించాడని హెచ్ఎం వెంకటయ్య తెలిపారు. ఉపాధ్యాయులు కిషోర్‌ను, తల్లి వేణమ్మను అభినందించారు.

మహిళా సాధికారతే జగనన్న ధ్యేయం


మహిళలకు చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సోమవారం కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పొదుపు మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. భరత్ మాట్లాడుతూ మహిళలు బాగుపడితే ఆ కుటుంబం మొత్తం బాగుపడినట్లే అని ఎన్నో సందర్భాల్లో ముఖ్యమంత్రి చెప్పారని, దానికి అనుగుణంగానే ప్రతి పథకంలోను మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కుప్పం రూరల్ మండలంలో 1,340 మంది గ్రూపులు ఉన్నాయని, ఇందులో 14,936 మంది సభ్యులుగా ఉన్నారన్నారు. వీరికి చెప్పిన మాట ప్రకారం మూడవ విడత ఆసరాలో రూ.19.3 కోట్లు ఇచ్చారని చెప్పారు. ఇంతపెద్ద మొత్తంలో మహిళలకు సాయం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నాయకుడి నియోజకవర్గమైనా ఏనాడు వివక్ష చూపక అడిగిన వెంటనే గృహాలు, రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఇంత చేస్తున్న ముఖ్యమంత్రికి కుప్పం మహిళలు ఆయనకు అండగా నిలవాలని కోరారు. అనంతరం రూ.19.3 కోట్ల రూపాయల చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం


కల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాల లబ్ధి గురించి సోమవారం కల్లూరు సర్పంచ్ షుకూర్, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంట్లో ఎవరెవరికి ఎంతమేర లబ్ధిచేకూరిందో వివరిస్తూ తిరిగి మరింత లబ్ధి చేకూరాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని తెలిపారు. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ ప్రచారం నిర్వహించి ఇంటింటా స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, కాణిపాకం ట్రస్టు బోర్డు సభ్యుడు మువ్వల నరశింహులు శెట్టి, ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, అలీభాయ్, సౌకత్‌అలీ, ఎస్ఎస్ కిషోర్, సహీనా పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు తెలియజేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మునితుకారం

చౌడేపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి చౌడేపల్లె మండల వ్యాప్తంగా చేసిన అభివృద్ధిని గృహసారథులు వారికి కేటాయించిన గృహాల వారికి తెలియజేయాలని మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం ఆదేశించారు. సోమవారం ఏ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, ఆమినిగుంట, చౌడేపల్లె,వెంగళపల్లె, కొండామర్రి , గడ్డంవారిపల్లె, పరికిదొన గ్రామసచివాలయాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఊహించని రీతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో పుంగనూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిచేశామన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలందరి మద్దతు ఉండేలా గృహసారథులు పనిచేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లడ్డూ రమణ, రాధాకృష్ణ, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ బోయకొండ కమిటీ చైర్మన్ శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, సర్పంచ్ వరుణ్, ఎంపీటీసీ రూపారేఖ పాల్గొన్నారు.

వేలంలో రూ.2.62 లక్షల ఆదాయం

చౌడేపల్లె: స్థానిక మేజర్ పంచాయతీ సచివాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన వేలం పాటలో రూ.2.62 లక్షల ఆదాయం సమకూరినట్లు పంచాయతీ ఈఓ సుధాకర్‌రావు తెలిపారు. సర్పంచ్ వరుణ్ అధ్యక్షతన వేలం పాట నిర్వహించగా ప్రైవేటు బస్టాండ్‌ను రూ.2.03 లక్షతో భవానీ సింగ్ సొంతం చేసుకున్నారు. అలాగే పంచాయతీకి చెందిన ఏడు చెరువులకు రూ.56,700 ఆదాయం వచ్చిందన్నారు. టెంకాయ చెట్ల ఫలసాయం ద్వారా రూ.3,200 ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీలో పలమనేరుకు సముచిత స్థానం


జిల్లా కమిటీలో పలమనేరు వాసులు

పలమనేరు: యూటీఎఫ్ జిల్లా కమిటీలో పలమనేరుకు సముచిత స్థానం దక్కినట్లు ఆ సంఘ నేతలు సోమవారం పలమనేరులో తెలిపారు. జిల్లా కార్యవర్గంలో రాష్ట్ర కౌన్సిలర్‌గా ప్రకాష్, జిల్లా కోశాధికారిగా ప్రసన్నకుమార్, కార్యదర్శిగా కృష్ణమూర్తి, ఆడిట్ కన్వీనర్‌గా బాబు, సోషల్ మీడియా కన్వీనర్‌గా మోహన్ ఎంపికైనట్లు తెలిపారు.

తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి


పరీక్ష ప్యాడ్లు ఇస్తున్న సర్పంచ్ కుమారస్వామి

కుప్పంరూరల్: బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చందం సర్పంచ్ కుమారస్వామి పేర్కొన్నారు. చందం ఉన్నత పాఠశాల 25వ వార్షికోత్సవం, 10వ తరగతి వీడ్కోలు సమావేశాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కుమారస్వామి మాట్లాడుతూ పాఠశాల నుంచి పది పరీక్షల్లో మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధిస్తే రూ.50 వేలు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు బహుమతిగా ఇచ్చారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.